## అర్హులకే రుణమాఫీ వర్తింపు : ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జూలై 18 : జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ పథకం వర్తించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు రుణమాఫీపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మొదటి విడతగా రూ.లక్షలోపు పంట రుణాలు ఉన్న 57,857 మంది రైతులకు రుణమాఫీ లబ్ధి చేకూరుతుందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2లక్షల రుణమాఫీ పథకం అమలవుతుందని, దీనిపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం జమ చేసిన వెంటనే బ్యాంకులు లోన్ ఖాతా నుంచి సంబంధిత సొమ్మును రైతుల సేవింగ్స్ ఖాతాలోకి బదలాయింపు చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి, వ్యవసాయాధికారి వారీగా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాల ఏర్పాటు పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, జిల్లా ఉద్యానవన అధికారి వెంకటరమణ, ఇన్‌చార్జి ఎల్డీఎం శివకుమార్, బ్యాంకర్లు పాల్గొన్నారు.



రైతువేదిక వద్ద రైతులు అడుగుతున్న సందేహాలకు సమాధానం ఇస్తున్న ఏఈవో

## భద్రాద్రి జిల్లాలో 28,018 మందికి..

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 18 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి జిల్లాలో లక్షల మంది రైతులు ఉంటే తొలి విడత పేరుతో కేవలం 28,018 మందికే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసింది. అయితే మిగతా రైతుల రుణాలన్నీ రెండో, మూడో విడతల్లో మాఫీ అవుతాయని అధికారులు తెలిపారు. నియోజకవర్గాలవారీగా అశ్వారావుపేటలో 7,366, భద్రాచలంలో 4,345, కొత్తగూడెంలో 3,327, పినపాకలో 7,852, ఇల్లెందులో 3,602, వైరాలో 1,526 మంది రైతులకు చెందిన రూ.లక్షలోపు ఉన్న పంట రుణాలు మాఫీ అయినట్లు అధికారులు ప్రకటించారు. కాగా, జిల్లాలో ఎంతమంది రైతులు రుణమాఫీకి అర్హులు అనే వివరాలను అధికారులు వెల్లడించడం లేదు. అయితే, మొదటి విడతలో ప్రభుత్వం కొందరికే రుణమాఫీ చేయడంతో మిగిలిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకర్లు సరైన సమాధానం చెప్పకపోవడం, వ్యవసాయ అధికారులు జాబితాను గోప్యంగా ఉంచడం వంటి కారణాలతో రైతులు ఆయా రైతువేదికల వద్ద సమాధానాల కోసం ఎదురుచూశారు.

### ఎవరిని అడిగినా సమాధానం చెప్పట్లేదు..



రైతురుణ మాఫీకి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే మేం నష్టపోతాం. మా దంపతులకు ఒకటే రేషన్‌కార్డు ఉంది. ఇద్దరి పేర్లతో వేర్వేరు పట్టాదారు పాస్ పుస్తకాలు ఉండడంతో వాటిపై పంట రుణాలు తెచ్చుకొని పంటలు సాగు చేసుకున్నాము. నా భార్య భద్రి పేరుమీద రూ.లక్ష అప్పు ఉంది. రుణమాఫీ అంటూ అధికారులు మమ్ములను మీటింగ్‌కు పిలిచారు. మా పేర్లు వచ్చాయో లేదో చెప్పలేదు. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడం లేదు. కొత్త రూల్స్ పెడుతున్నారు.

**–భూక్యా సీతారాములు, గడ్డిగుట్ట, లక్ష్మీదేవిపల్లి మండలం**

### ఇద్దరి లోన్లు మాఫీ అవుతాయో లేదో చెప్పలేదు



మా అమ్మకు రేషన్ కార్డు ఉంది. అందులో నా పేరు ఉంది. నా పేరున పంట రుణం కూడా ఉంది. ఇద్దరికీ మాఫీ అవుతుందా? మా ఊర్లో మాలాంటి వాళ్లు చాలామంది ఉన్నారు. ఎవరూ ఏమీ చెప్పకుండా మీటింగ్‌కు రమ్మన్నారు. వచ్చాము. టీవీలో మాట్లాడుతున్నారు. అందరూ వెళ్లిపోయారు. అందరి పేర్లు వచ్చాక అసలు ఎవరికి రాలేదో తెలుస్తుంది.

**–అజ్మీరా రమేశ్, రైతు, గడ్డిగుట్ట, లక్ష్మీదేవిపల్లి మండలం**

# రుణమాఫీ ప్రక్రియ షురూ



లక్ష్మీదేవిపల్లి రైతువేదికలో రుణమాఫీపై వీసీలో పాల్గొన్న అధికారులు, రైతులు



- ఖమ్మం జిల్లాలో తొలి విడతలో 59,172 మందికి మాఫీ
- భద్రాద్రి జిల్లాలో 28,018 మంది రైతులకు వర్తింపు
- రూ.లక్షలోపున్న రుణాలు మాఫీ అయినట్లు అధికారుల వెల్లడి
- ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన రైతు వేదికల్లో సంబురాలు
- కానీ.. జాబితాలో పేర్లులేని అన్నదాతల్లో తీవ్రమైన ఆందోళన
- సందేహాలు తీర్చని అధికారులు.. అయోమకంలో అన్నదాతలు..

ఖమ్మం, జూలై 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతు రుణమాఫీ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తొలి విడతలో భాగంగా రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతుల ఖాతాల్లో సంబంధిత నగదును ప్రభుత్వం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ 9లోపు రూ.2 లక్షల్లోపు పంట రుణాలు తీసుకున్న రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ మేరకు గురువారం రూ.లక్షలోపు రుణాలున్న రైతుల ఖాతాల్లో సంబంధిత నగదును జమ చేసే ప్రక్రియను చేపట్టింది. అయితే, రూ.50 వేల నుంచి రూ.5 లక్షల్లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఖమ్మం జిల్లాలో 3,73,157 మంది ఉన్నారు. వీరు రూ.4307.58 కోట్లను రుణంగా పొందారు. భద్రాద్రి జిల్లాలో 1,86,034 మంది రైతులు రూ 1,816.35 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. అయితే, వీరిలో 'రూ.2 లక్షల్లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు ఎంతమంది ఉంటారు? వారు ఎవరు?' అనే జాబితాను జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు ప్రకటించాల్సి ఉంది.

### ఖమ్మం జిల్లాలో 59,172 మందికి..

ఖమ్మం జిల్లాలో రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతుల్లో 59,172 మందికి తొలి విడతలో గురువారం రుణమాఫీ అయింది. వీరి ఖాతాల్లో రూ.264.23 కోట్లు జమ అయ్యాయి. వీరిలో రూ.30 వేల నుంచి మొదలుకొని రూ.90 వేల వరకు పంట రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 130 రైతువేదికలకు గాను మండలానికి ఒక రైతువేదికను అధికారులు ఎంపిక చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించే కార్యక్రమాన్ని జిల్లాలోని 21 రైతువేదికల్లో వీడియోకాన్ఫరెన్స్‌ల ద్వారా రైతులు వీక్షించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా రైతువేదికల్లో రైతులతో సంబురాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా, అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అనేకమంది రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. కాగా, ఆయా నియోజకవర్గాల్లో జరిగిన సంబురాల్లో ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాసునాయక్‌తోపాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### జాబితాలో పేర్లు లేవంటూ రైతుల ఆవేదన..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేవంటూ, అర్హుల ఎంపికలో తప్పులు జరిగాయంటూ చాలాచోట్ల రైతులు ఆరోపించారు. ప్రభుత్వం పెట్టిన అనేక కొర్రీలతో తాము రుణమాఫీ కోల్పోయామంటూ రైతువేదికల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి క్రాప్ లోన్ తీసుకున్న తమ పేర్లు, పట్టాబుక్ ద్వారా పంట రుణాలు తీసుకున్న తమ పేర్లు రుణమాఫీ జాబితాలో లేవని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పుడు కొందరికే రుణమాఫీ చేస్తోందని చాలామంది రైతులు వాపోయారు. తక్షణమే రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## రైతుల సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

### రుణమాఫీ నిధులను ఇతర రుణాలకు మళ్లించొద్దు

### బ్యాంకర్ల సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో రూ.లక్షలోపు రుణమాఫీ లబ్ధిదారులు 28,018 మందిగా గుర్తించినట్లు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తెలిపారు. జిల్లాలో రైతు రుణమాఫీ పథకం అమలుపై అన్ని బ్యాంకుల అధికారులతో కలెక్టర్ ఐడీవోసీ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన లబ్ధిదారులందరికీ తమ బ్యాంకు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ అవుతాయని తెలిపారు. అన్ని బ్యాంకుల అధికారులు రుణమాఫీ డబ్బులను కారణాలు చూపుతూ నిలుపుదల చేయొద్దని ఆదేశించారు. రుణమాఫీ కింద భూమి కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందన్నారు. 2018, డిసెంబర్ 12వ తేదీ లేదా ఆ తర్వాత మంజూరైన లేదా రెన్యువల్ అయిన రుణాలకు, 2023, డిసెంబర్ 9వ తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. పంట రుణమాఫీపై సందేహాలు, ఇబ్బందుల పరిష్కారానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా హెల్ప్ డెస్క్ నంబర్లను ఏర్పాటు చేశామని, రాజేశ్వర్ (జూనియర్ అసిస్టెంట్) 7416442798, అశోక్‌కుమార్ (వ్యవసాయాధికారి) 9550226672 నంబర్లలో సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రాంరెడ్డి, అన్ని బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.





బ్యాంకు అధికారులకు సూచనలు చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

## చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి పెట్టండి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న సీపీ

బోనకల్లు, జూలై 18 : చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన పలు రికార్డులు తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరును పరిశీలించారు. నేరప్రవర్తన కలిగిన హిస్టరీ షీట్, రౌడీషీటర్ల రికార్డుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధిత ఫిర్యాదుదారులతో మాట్లాడారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఖమ్మం కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం, నియంత్రణపై నిఘా పెంచాలని, సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కేసుల నమోదు విషయంలో తాత్సారం చేయొద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యపరచాలని, దీనిపై సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు.

## గనులను సింగరేణికే కేటాయించాలి

### రాజ్‌భవన్ ముట్టడిలో టీబీజీకేఎస్ నాయకులు



హైదరాబాద్‌లో రాజ్‌భవన్ ముట్టడిలో పాల్గొని నినాదాలు చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

రామవరం/మణుగూరు టౌన్, జూలై 18 : రాష్ట్రంలో సిరులు కురిపించే బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో భద్రాద్రి జిల్లాకు చెందిన టీబీజీకేఎస్ నాయకులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి బొగ్గు గనుల వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, వాటిని సింగరేణికే కేటాయించే విధంగా ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. అనంతరం టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, కాపు కృష్ణ, రాంబాబు యాదవ్‌ల సారథ్యంలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని హైదరాబాద్‌లో రాజ్‌భవన్‌ను ముట్టడించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాజ్‌భవన్ వైపు వెళ్లగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, టీఆర్‌కేవీ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్, కిరణ్, నాగెలిల, బంగారి పవన్, జాఫర్, హుస్సేన్, బడితల సమ్మయ్య, అవినాశ్, నరేశ్, నేత కిరణ్‌తోపాటు కార్మిక సంఘాల నాయకులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

# వానే.. వరదై..

- భద్రాద్రి జిల్లాలో దంచికొట్టిన వర్షం
- అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు రెండుచోట్ల గండి
- పెదవాగు పొంగడంతో వరదలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులు, కూలీలు
- రంగంలోకి దిగిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు... రెండు హెలికాప్టర్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- కారులో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించిన గ్రామస్తులు



అశ్వారావుపేట టౌన్: వెంకమ్మచెరువు కింద నీటమునిగిన పంటపొలాలు

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 18 (నమస్తే తెలంగాణ)/అశ్వారావుపేట రూరల్/అశ్వారావుపేట టౌన్ : భద్రాద్రి జిల్లాలో బుధవారం రాత్రి ముసురుతో ప్రారంభమైన వర్షం గురువారం నాటికి అతలాకుతలం చేసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు పొంగిపొర్లాయి. ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరడంతో నిండుకుండను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం.. భారీ చెట్లు రోడ్లపై విరిగిపడడం.. వరద నీరు రహదారులపై ప్రవహించడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని పెదవాగులోకి భారీగా వరద నీరు చేరడంతో మూడు గేట్లు ఎత్తి 22,330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ నుంచి ఎక్కువగా వరద నీరు ప్రవహించడం వల్ల ప్రాజెక్టులోని నీరు ఎగపోటుతోపాటు పలు వాగులు, వంకలు పొంగడంతో అశ్వారారావుపేట మండలం నారాయణపురం, బచ్చువారిగూడెం, అనంతారం, ఖమ్మంపాడు, మేకలబండ, రంగాపురం, కొత్తూరు గ్రామాల వైపు నీరు చుట్టుముట్టింది. దీంతో ఆయా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అశ్వారావుపేట, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెదవాగు వరద ఉధృతి ఎక్కువ కావడంతో వాగుకు రెండుచోట్ల గండి పడింది. దీంతో గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాలు నీట మునిగే ప్రమాదమున్న నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెదవాగు వరద నీటిలో 25 మంది ప్రయాణికులు, కూలీలు చిక్కుకొని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో సమాచారం అందుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకోవడంతోపాటు హెలీకాప్టర్ సహాయంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బచ్చువారిగూడెంలో పశువుల కాపరులు చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. వారిని హెలికాప్టర్ ద్వారా రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో బోటు సహాయంతో నారాయణపురం ప్రాంతానికి తరలించారు. అశ్వారావుపేట నుంచి భద్రాచలం వెళ్లే రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంకమ్మ చెరువు కింద పంట పొలాలు వరద నీటిలో తేలియాడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు నుంచి వేలేరుపాడుకు కారులో వెళ్తున్న ఐదుగురు ప్రయాణికులు వరదలో చిక్కుకున్నారు. దీంతో కారును వదిలేసి చెట్లను పట్టుకోవడంతోపాటు హాహాకారాలు చేయడంతో అల్లూరిసీతారామనగర్ వద్ద గ్రామస్తులు వారిని రక్షించారు. వరద ఉధృతికి వారి కారు నీటిలో కొట్టుకుపోయింది. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ఉన్నతాధికారులతో మాట్లాడి రక్షణ చర్యలు చేపట్టారు.

### జిల్లావ్యాప్తంగా వర్షాలు..

రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కిన్నెరసానిలో 402 అండుగుల మేర వరద నీరు వచ్చి చేరింది. తాలిపేరులో వరద నీరు చేరడంతో తాలిపేరు పొంగి ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద 22 అడుగుల వరకు వరద నీరు చేరింది. రాత్రి 7 గంటలకు 18.2 అడుగులతో నిలకడగా ఉంది. భద్రాచలం నుంచి చర్ల వైపు వెళ్లే రహదారిపైకి వరద నీరు రావడంతో అక్కడ సహాక చర్యలు చేపట్టారు. అత్యధికంగా అశ్వారావుపేటలో 109 మి.మీ, దమ్మపేట మండలంలో 80 మి.మీ, అన్నపురెడ్డిపల్లిలో 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పాల్వంచ, సుజాతనగర్, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.అయితే రుణమాఫీ సంబురాల్లో అధికారులు ఉంటే.. వర్షాలకు గిరిజన ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నా పట్టించుకునేవారు లేరనే వాదనలు వినిపిస్తున్నాయి.



అశ్వారావుపేట రూరల్: వినాయకపురంలో పొర్లుతున్న వాగు ప్రవాహం



ప్రమాదస్థాయికి చేరిన వెంకమ్మ చెరువు వరద



గుర్రాలచెరువు-మొద్దులగూడెం మార్గంలో కోతకు గురైన రహదారి

అశ్వారావుపేట టౌన్: నీట మునిగిన పట్టణ రోడ్డు





వరద గురించి తెలుసుకుంటున్న ఎస్పీ



రోడ్డు పైనుంచి వెళ్తున్న వరద



పెదవాగు ప్రాజెక్టు కట్ట పైనుంచి పారుతున్న వరద

## వరదలో చిక్కుకున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు..

అశ్వారావుపేట రూరల్, జూలై 18 : పెదవాగు వరద నీటిలో చిక్కుకున్న మండలంలోని నారాయణపురం, బచ్చువారిగూడెం, ఏపీకి చెందిన వారిని మొత్తం.. 25 మందిని ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతోపాటు హెలికాప్టర్ సహాయంతో సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. దీంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇరు రాష్ట్రాల ఎమ్మెల్యేలు జారే అదినారాయణ, చిర్రి బాలరాజు లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎగువ ప్రాంతాలకు తరలించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. వరదలో చిక్కుకున్న ప్రయాణికులు, కూలీలు, పశువుల కాపరులకు ధైర్యం చెప్పారు.



సురక్షిత ప్రాంతానికి చేరిన కూలీలు

## ఖమ్మంలో ముసురు

ఖమ్మం వ్యవసాయం, జూలై 18 : అల్పపీడన ప్రభావం ఖమ్మం జిల్లాపై స్వల్పంగా కనిపించింది. నగరంతోపాటు రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల తదితర మండలాల్లో చిరుజల్లులతో ముసురు పడింది. సత్తుపల్లి డివిజన్‌లోని సత్తుపల్లి, పెనుబల్లి, మధిర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. ఉదయం నుంచి జల్లులు, ముసురు పడడంతో వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలిగింది.

### బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిటౌన్, జూలై 18 : సత్తుపల్లిలో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జేవీఆర్, కిష్టారం ఓపెన్ కాస్టులలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. జేవీఆర్ ఓసీలో 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 30 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగించే పనులకు, కిష్టారం ఓసీలో 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 30 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులకు అంతరాయం ఏర్పడిందని సింగరేణి ప్రాజెక్టు అధికారులు తెలిపారు. గనుల్లో నిలిచిన వర్షపు నీటిని మోటర్ల సహాయంతో బయటకు తోడేసి బొగ్గు ఉత్పత్తి పనులు పునఃప్రారంభిస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అయితే రాత్రి కురిసిన వర్షంతో సత్తుపల్లిలో 15 మీ.మీ వర్షపాతం నమోదైంది.



సత్తుపల్లి టౌన్: కిష్టారం ఓసీలో నిలిచిన వర్షపు నీరు